క్లుప్తంగా

మేథాట్రస్ట్‌కు విద్యార్థుల ఎంపిక


అన్వేష్


అరవింద్ గౌడ్

జన్నారం: మేథా చారిట్రబుల్ ట్రస్ట్ అందిస్తున్న మేథా సంపూర్ణ శిక్ష ఉచిత కార్పొరేట్ విద్య కోసం జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మేథా చారిట్రబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో కిష్టాపూర్ పాఠశాలకు చెందిన ఆకుల అన్వేష్, గొల్లపల్లి అరవింద్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. ఈ విద్యార్థులు హైదరాబాద్‌లో గల మేథా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఇంటర్ నుంచి మెడిసిన్ వరకు ఉచితంగా విద్యను అభ్యసించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఎంపికపై అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ, ఉపాధ్యాయులు కమలాకర్ తదితరులు అభినందించారు.

నేడు నిరసన ప్రదర్శనలు

శ్రీరాంపూర్: కేంద్రం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్లకు నిరసనగా మంగళవారం సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంఘటిత కార్మిక వర్గంతో పాటు అసంఘటిత కార్మికవర్గ సమస్యలపై జరుగుతున్న నిరసనలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'జాన్సన్‌నాయక్‌పై కేసు కక్ష సాధింపు చర్య'

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌పై ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలో భాగమని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఫజల్ ఖాన్ ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిన ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాడుతున్న జాన్సన్ నాయక్‌పై అకారణంగా కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అందించడంలో, పథకాల అమలులో విఫలమవుతుందని, ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తున్న జాన్సన్ నాయక్‌పై కావాలనే కేసులు నమోదు చేసి కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నేటి నుంచి ఎస్‌జీటీలకు శిక్షణ తరగతులు

తాండూర్: మండలంలోని ఎస్‌జీటీలు, ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎం ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రైమరీ గ్రేడ్‌లో ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ 25వ తేదీ వరకు విద్యాభారతి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

నస్పూర్: ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు సోమవారం సీసీసీ కార్నర్ వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, ఆర్థిక పరమైన రిజర్వేషన్లు చెల్లవని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖపురి భీంసేన్, శీపతి రాములు, తోకల వెంకటేశ్, వేముల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం



భీమారం: మండలంలోని ధర్మారం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న మహిళాభవన్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. అధికారులు చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని మహిళలు కోరుతున్నారు.

భగీరథ.. నీరు వృథా



వేమనపల్లి: మండల కేంద్రంలో వాటర్‌ట్యాంకుకు నీళ్లు ఎక్కించే క్రమంలో మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ లేక నీరు వృథాగా పోతుంది. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండగా, నీరు వృథా పోతున్నా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

జన్నారం: మండలంలోని కలమడుగులో రామయజ్ఞం సందర్భంగా సోమవారం ఆంజనేయ స్వామి దీక్షాపరులు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రాజనరేంద్రశర్మ, భక్తులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

- యుద్ధ కళలపై చిన్నారుల ఆసక్తి
- జిల్లాలో 30కి పైగా కరాటే శిక్షణ శిబిరాలు

చెన్నూర్: ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం, దేహదారుఢ్యం, శారీరక ధృడత్వానికి కరాటే దోహదపడుతుంది. ఈ తరుణంలో వేసవి శిక్షణ శిబిరాల్లో యుద్ధ కళలైన కరాటే, తైక్వాండో, బాక్సింగ్ శిక్షణలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సమ్మర్ సెలవులను వృథా చేయకుండా పిల్లల ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు ఆయా శిక్షణ తరగతుల్లో చేర్పిస్తుండగా, చిన్నారులు ఆయా రంగాల్లో ప్రావీణ్యం పొందుతున్నారు.

జిల్లాలో...

జిల్లాలో ప్రారంభమైన యుద్ధ కళల శిక్షణ తరగతుల్లో చిన్నారులు కిక్ పంచ్‌లు విసురుతూ మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుంటున్నారు. యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడలతో పాటు కరాటే, తైక్వాండో, బాక్సింగ్ శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. కాసిపేటలో కరాటే, గరిమిల్లలో తైక్వాండో, పారుపల్లిలో బాక్సింగ్ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సుమారు 250మంది మాస్టర్లకు ఉపాధి లభిస్తుండగా, సమ్మర్ క్యాంప్‌లలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

యుద్ధ కళలపై ఆసక్తి...

బాల, బాలికలలో యుద్ధ కళలపై రోజురోజుకు ఆసక్తి పెరుగుతుంది. జిల్లాలో బెల్లంపల్లి, మంచిర్యాల, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, కాసిపేట, తాండూర్, శ్రీరాంపూర్, చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి పట్టణాల్లో 50కి పైగా కరాటే, బాక్సింగ్, తైక్వాండో శిబిరాలు నిర్వహిస్తుండగా, 70శాతం మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ తరగతులపై ఫోకస్..

ఐదేళ్లుగా ప్రభుత్వం బాలికల ఆత్మరక్షణే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. ఏటా ప్రభుత్వ పాఠశాలలో 6నుంచి 9వ తరగతి చదివే విద్యార్థినులకు నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల పాటు ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే.


చెన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

నేర్చుకుంటున్నా..



కరాటే అంటే నాకు చాలా ఇష్టం. ఈ వేసవి సెలవుల్లో నేను, మా తమ్ముడు ఇద్దరం కరాటే నేర్చుకుంటున్నాం. ప్రతీరోజు ఉదయం 6నుంచి 8గంటల వరకు కరాటే క్లాస్‌లకు వెళ్తున్నాం. ఇక నుంచి ఏటా సమ్మర్‌లో కరాటేనే నేర్చుకుంటాం.

\- మేడ సనాతని, విద్యార్థిని, చెన్నూర్

రెండేళ్లుగా...



గతేడాది నుంచి సమ్మర్‌లో కరాటే క్లాస్‌లకు వెళ్తున్నా. నెల రోజుల పాటు కరాటే నేర్చుకోవడంతో గత డిసెంబర్‌లో మంచిర్యాలలో జరిగిన జాతీ య స్థాయి కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి సాధించా.

\- ఆర్.స్నేహిత్, సుద్దాల

కులాల మధ్య చిచ్చుపెడితే చూస్తూ ఊరుకోం

- ఎంపీ గడ్డం వంశీకి దళితసంఘాల నాయకుల హెచ్చరిక

పాతమంచిర్యాల: కులాలు, మతాలు వర్ణవిభేదాలకు అతీతంగా సోదరభావంతో ఉంటున్న నియోజకవర్గ ప్రజల మధ్య అశాంతి వాతావరణం నెలకొల్పాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చూస్తున్నారని దళిత సంఘాల నేతలు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని ఎంపీ వంశీకృష్ణ మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయాలని సూచించారని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నాయకత్వంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఐకమత్యంతో, సోదరభావంతో కలిసిమెలిసి ఉన్నారని, వారి స్వార్థం కోసం మాల, మాదిగ కులాల వారిగా రెచ్చగొట్టి అలజడులు సృష్టించాలని చూడడం సరికాదని హితవు పలికారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో ఆందోళనలు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశామని, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు, నేతకాని కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, నాయకులు జుమ్మిడి గోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు గొడిశెల దశరథం, బెక్కం రాజారావు, ఐలయ్య, మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు రామగిరి బాణేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి తిరుపతి, నాయకులు సల్ల మహేశ్, అశోక్‌తేజ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు గజ్జెల హేమలత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుర్మిళ్ల వేణు, నాయకులు

ఘనంగా సుందరయ్య వర్ధంతి

బెల్లంపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదర్శమూర్తి అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి సీపీఎం శ్రేణులు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, నాయకులు అశోక్, బానుమతి, రవీందర్, అరవింద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తాండూర్: మండల తహసీల్దార్‌గా యు.జ్యోత్స్న సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమెకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ కేడీ ప్రసాద్, ఆర్ఐలు ఎజాజుద్దీన్, పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం సేకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరిధాన్యం సేకరణ వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20 మిల్లులు, కరీంనగర్‌లోని 64 మిల్లులే కాకుండా పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రత్యేక కాల్ సెంటర్ నంబరు 6303928683 ఏర్పాటు చేశామని, లారీల కొరత లేదని, ప్రతీ కొనుగోలు కేంద్రంలో 20 నుంచి 30 చొప్పున టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇబ్బందులు లేవు..

జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ ఒక ప్రకటనలో తెలిపారు. గన్నీ సంచులు, టార్పాలిన్ల కొరత లేదని, లారీలు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. భీమారం మండలంలో ఒక్క రైతు ధాన్యం తడిసినా ఆరబెట్టి విక్రయించారని, తడిసి నష్టపోయినట్లుగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. కోటపల్లి మండలంలో ఒక్క రైతు ధాన్యం కూడా తడిసిపోలేదని పీఏసీఎస్ కార్యదర్శి తెలిపారని పేర్కొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదాలు సోమవారం సీహెచ్‌పీని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ అసిస్టెంట్ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన షెడ్డు అధ్వానంగా ఉందన్నారు. చుట్టూ రక్షణ కోసం రేకులు ఏర్పాటు చేసి కప్‌బోర్డ్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సెకండ్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్‌లలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లను నియమించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృష్ట్యా కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. క్వాలిటీ రూమ్ వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అడ్డూరి శ్రీనివాస్, ఫిట్ సెక్రెటరీ తిరుపతి, సహాయ కార్యదర్శి సాయిరాజ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

పంటనష్టం సర్వే

నెన్నెల: కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారిని సృజన తెలిపారు. మైలారం, గొల్లపల్లి, గన్‌పూర్ ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పొలాలను సోమవారం పరిశీలించామన్నారు. 100ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాయం అందేలా చూస్తామని ఏవో తెలిపారు.


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏవో సృజన

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు చెన్నూర్ నుంచి వెళ్తుండగా, పట్టణంలోని జాతీయ రహదారిపై కేంద్ర మంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్, నాయకులు రాపర్తి వెంకటేశ్వర్, బత్తుల సమ్మయ్య, జాడి తిరుపతి, గర్రెపల్లి వెంకటనర్సయ్య, ఆలం బాపు, శివకృష్ణ, వంశీకృష్ణ, పున్న చందు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు జమ

నెన్నెల: పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జంగాల్‌పేటలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి మొదటి విడత బిల్లు మంజూరైందని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. పునాదుల వరకు పనులు పూర్తి చేసిన ఇద్దరు లబ్ధిదారులకు రూ.ఒక్కో లక్ష చొప్పున సోమవారం వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. దశల వారీగా లబ్ధిదారులందరికీ బిల్లులు అందజేస్తామన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల, హాజీపూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం మంచిర్యాల మండల విద్యాధికారి మాళవీదేవి, హాజీపూర్ మండల విద్యాధికారి(ఎంఈవో) పోటు తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. యూడైస్ స్ట్రెంత్ ఆధారంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

బదిలీ సర్క్యూలర్ రద్దు చేయాలి

మందమర్రిరూరల్: సింగరేణి యాజమాన్యం ఇటీవల తీసుకొచ్చిన బదిలీల సర్క్యూలర్ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గుఉత్పత్తి, లక్ష్యసాధన కోసం ఉద్యోగులంతా కలిసికట్టుగా శ్రమిస్తుంటే, యాజమాన్యం కొత్త సర్క్యూలర్‌ను తీసుకొచ్చి ఉద్యోగుల్లో గందరగోళం సృష్టిస్తుందని ఆరోపించారు. నూతన సర్క్యూలర్ ప్రకారం బదిలీలు చేస్తే, సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి రాదని, సర్క్యూలర్ రద్దు కోసం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, సదయ్య, తిరుపతి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సమ్మయ్య

'మా భూములన్నీ పట్టా భూములే'

లక్సెట్టిపేట: ఇటిక్యాల చెరువు ప్రదేశంలో ఉన్న భూములన్నీ పట్టా భూములేనని పట్టాదారులు అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామ చెరువు ప్రదేశంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చెరువు సమీపంలో ఉన్న భూములు తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని, భూములన్నీ తమ సొంత పట్టా భూములే అన్నారు. కొంతమంది వ్యక్తులు ఆ భూములు ఎఫ్‌టీఎల్, శిఖంలో ఉన్నాయని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అది వాస్తవం కాదన్నారు. అధికారులు హద్దులు కేటాయిస్తే సహకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టాదారులు చుంచు చిన్నయ్య, తిరుపతి, పడాల కాంతయ్య, పడాల గౌతం, శ్రీనివాస్, భూమేష్, గంగాధర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పట్టా భూముల యజమానులు

చెరువు భూమికి హద్దులు నిర్ణయించాలి

లక్సెట్టిపేట: ఇటిక్యాల చెరువు భూమికి హద్దులు నిర్ణయించాలని మత్స్య కార్మికుల సంఘం అధ్యక్షుడు మేడి రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలిచ్చినా స్పందించడం లేదన్నారు. కొంతమంది చెరువు భూమిలో మట్టిని తొలగిస్తూ, ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చెరువు భూమి కబ్జాకు గురవుతుందని, మత్స్య కార్మికులకు జీవనోపాధి కరువవుతుందని సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువు పూర్తి విస్తీర్ణానికి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార్మికులు మేడి నారాయణ, భీమన్న, పోచం, నర్సయ్య, చందు, చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సప్ప రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

దండేపల్లి: మండలంలోని కోయపోచగూడెంను పోడు జాబితాలో చేర్చి, ఆదివాసీ గిరిజనులకు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ నాయకులు కనికగరపు అశోక్, దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీటీ విజయ, ఎంపీడీవో ప్రసాద్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2002నుంచి ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. గ్రామాన్ని పోడు జాబితాలో చేర్చకుండా గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలి

భీమిని: గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కన్నెపల్లి, భీమిని తహసీల్దార్లు శ్రావణ్‌కుమార్, బికార్ణదాస్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

జైపూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గోదావరి తీర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేపడుతున్నారని, ఆ అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కోరుతూ ఇందారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు షరీఫ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కొందరు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని, దాన్ని అరికట్టాలని విన్నవించారు.